www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 ఫిబ్రవరి 2025

పిఠాపురంలో జనసేన ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి తరుపున సోమవారం పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో జనసేన నాయకులతో పాటు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.కనకారావు (వృత్తంలో వ్యక్తి) పాల్గొన్నారు.

నేటితో ప్రచారానికి తెర

27న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెరపడనుంది. ఒక్కరోజే సమయం ఉండటంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఎన్నికల సందడి జోరందుకుంది. తుది ప్రచారానికి అభ్యర్థులు పదును పెట్టారు. ఈ నెల 27న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి పోలింగ్ జరుగనుంది. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాల్లోనూ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర్రాఘవులుతో పాటు మరో 34 మంది బరిలో ఉండడంతో ఈసారి ఎన్నికలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రధానంగా పిడిఎఫ్, కూటమి అభ్యర్థి మధ్య పోటీ నెలకొనడంతో ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

ఏర్పాట్లు పూర్తి...సిబ్బంది సిద్ధం

ఉభయగోదావరి జిల్లాల్లో 3,14,984 మంది పట్టభద్రులు ఓటర్లున్నారు. ఇందులో 1,83,347 మంది పురుష ఓటర్లు, 1,31,618 మంది మహిళా ఓటర్లు, 19 మంది ఇతర ఓటర్లున్నారు. ఈనెల 27న పోలింగ్ జరుగనుంది. 35 మంది బరిలో నిలవగా 113 మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. 440 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఆయా రెవెన్యూ డివిజనల్ కేంద్రాలకు ఇప్పటికే తరలించారు. వాటిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. వీటిని బుధవారం ఎన్నికల సిబ్బందికి అందజేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బంది, ఒక సూక్ష్మ పరిశీలకులు, ఒక వీడియో గ్రాఫర్‌ను నియమించారు.

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27న జరగనున్న అన్ని కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల్లో ఉపయోగించనున్న బ్యాలెట్ పత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తయింది. ఆయా డివిజన్ కేంద్రాల్లో ఉన్న ట్రెజరీల్లో వాటిని భద్రపరిచారు. ఈ సారి ఏకంగా 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న తరుణంలో బ్యాలెట్ పత్రాలు పెద్ద సైజులో ఉన్నాయి. దీంతో ప్రతి పోలింగ్ కేంద్రాల్లోనూ నాలుగు బ్యాలెట్ బాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు.

యాజమాన్యాలకు ఆదేశాలు

27న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రైవేటు యాజమాన్యాల్లో ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు వెసులుబాటు ఇవ్వాలని రిటర్నింగ్ అధికారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రయివేటు సంస్థల్లో వత్తి, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర రంగాల్లో ఓటర్లున్న నేపథ్యంలో విధులకు ఆలస్యమైనా అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు.

తొండంగిలో పిడిఎఫ్ అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాస్వామ్యమే గెలుస్తుంది

నీతి, నిజాయతీ గల అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.వి.రాఘవులు చెబుతున్నారు. తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లోనూ విస్తత ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, కార్మిక, పెన్షనర్ల సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు మద్దతుతో ఆయన ప్రచారం చేశారు.

అధికార పార్టీకి క్షేత్రస్థాయిలో ప్రతికూల వాతావరణమే కనిపిస్తుంది. కూటమి సర్కార్ అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ ఎటువంటి హామీలను అమలు చేయలేదు. ప్రధానంగా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లేలా వ్యవహరిస్తోంది. ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు భృతి వంటి హామీలను విస్మరించింది. ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడంతో నిరుద్యోగుల్లో ప్రభుత్వం పట్ల సానుకూల వాతావరణం కనిపించట్లేదు. మరోవైపు ప్రజలకిచ్చిన హామీలను సైతం అమలు చేయడానికి డబ్బులు లేవని, గత ప్రభుత్వ వైఫల్యం అంటూ సాకులు చెబుతూ తప్పించుకుని తిరుగుతున్న పరిస్థితి ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.. ఈ నేపథ్యంలో జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకుంది. అందుకే కొన్ని అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా దూర ప్రాంతంలో ఉన్న వారిని ఇక్కడికి రప్పించేందుకు ట్రాన్స్ పోర్ట్ ఛార్జీలను భరిస్తున్నారు. వివరి రెండు రోజుల్లో భారీ ఎత్తున ప్రలోభాలకు గురి చేసేందుకు అధికార పార్టీ రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలను అడ్డుకొని తీరతామని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తామని పిడిఎఫ్ సహా, ఇతర అభ్యర్థులు ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నారు.

గ్యాస్ అదనపు ఛార్జీల వసూళ్లపై చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జెసి నిషాంతి

గ్యాస్ డోర్ డెలివరీలో అదనపు ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, డోర్ డెలివరీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లాలోని 31 ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, వారి సంబంధిత డెలివరీ సిబ్బందితో స్థానిక గోదావరి భవన్‌లో సమావేశం నిర్వహించారు. అదనపు డోర్ డెలివరీ ఛార్జీల వసూళ్ళ, గ్యాస్ డోర్ డెలివరీ వద్ద తూనికలు ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మేలు చేకూర్చాలనే ప్రధాన సంకల్పంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇటీవల కాలంలో కోనసీమ జిల్లా ఎల్‌పిజి గ్యాస్ వినియోగదారుల నుంచి అదనపు డోర్ డెలివరీ ఛార్జీల వసూలు చేస్తున్నారని, జిల్లా నుండి 70 శాతం మంది నుంచి ఫిర్యాదులు ఐవిఆర్ఎస్, వాట్సాప్ క్యూఆర్ కోడ్, ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా వెల్లడించారని ఆమె తెలిపారు. డెలివరీ ఛార్జీలను రశీదులో ముద్రించిన సొమ్మును మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. డోర్ డెలివరీలో అధిక ఛార్జీల వసూళ్లపై క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అదనపు సొమ్ము వసూలు చేస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫిర్యాదు చేయవచ్చు నన్నారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాలసరస్వతి మాట్లాడారు. గ్యాస్ వినియోగదారులు, వారికిచ్చిన రసీదులో ముద్రించి ఉన్న ధర కంటే అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే వినియోగదారుడు సంబంధిత గ్యాస్ మార్కెటింగ్ కంపెనీ సేల్స్ అధికారికి, తహశీల్దార్, పౌర సరఫరాల ఉప తహశీల్దార్, జిల్లా పౌర సరఫరాల అధికారికి ఫిర్యాదు చేయాలని, లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1967 ద్వారా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ పథకంలో ఎటువంటి అవకతవకలు జరిగినా బాధ్యులైన ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్, డెలివరీ బాయ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌పిజి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, డెలివరీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఉమ్మడి ఉభయగో దావరి జిల్లాల పోలింగ్ సిబ్బంది ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన కల్పించుకుని పోలింగ్ ప్రక్రియను సజావుగా పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆర్‌డిఒ కె.మాధవి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనీ, మండపేట తహశీల్దారు తేజేశ్వరరావు ద్వారా అమలాపురం డివిజన్ పోలింగ్ సిబ్బందికి పూర్తి అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాధవి మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది శిక్షణను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల ప్రక్రియ మీద సిబ్బందికి పరిపూర్ణ అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా, బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ చాలా కీలకమన్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, న్యాయంగా పారదర్శకంగా నిర్వహించడానికి పోలింగ్ సిబ్బందికి సరైన శిక్షణ ఎంతైనా అవసరమన్నారు. ఎన్నికల ప్రక్రియపై పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నియమాలు, నిబంధనలు, ప్రక్రియల గురించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల పోలింగ్ సమయంలో తలెత్తే వివిధ సమస్యలను ఎలా పరిష్కరించాలో శిక్షణలో నేర్పించినట్టు తెలిపారు. పోలింగ్ సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఇసి మార్గదర్శకాల ప్రకారం ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు దెబ్బతినకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సులను, మెటీరియల్‌ను పిఒ, ఎపిఒలు బ్యాలెట్, పోలీసు బందోబస్తు మధ్య తరలించాలని, పోలింగ్, సెక్టార్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.

విఆర్ఒలకు షోకాజ్ నోటీసులపై నిరసన

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలో పనిచేస్తున్న విఆర్‌ఒలకు ఎంపిడిఒ షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై వారు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ అఖిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మొత్తం 21 మంది విఆర్‌ఒలకు ఎంపిడిఒ షోకాజ్ నోటీసులు ఇచ్చారని, ఇప్పటికే పలు పనులతో తీరికలేని విఆర్‌ఒలు మండల పరిషత్ అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేయలేదని, దీంతో అందరికీ నోటీసులు ఇచ్చారని ఈ విషయాన్ని స్థానిక తహశీల్దారుకు, ఆర్‌డిఒకు వివరించామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒల సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరావు, డివిజన్ ప్రెసిడెంట్ స్వామి నాయుడు, రెవెన్యూ సర్వీసెస్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు చిన్న, రామచంద్రపురం మండల అధ్యక్షులు పి.విష్ణుమూర్తి, నరేష్ కుమార్, సత్యవతి, ప్రతిమ సత్తిబాబు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విఆర్‌ఒలు

బ్యాలెట్ పేపర్ల పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం

ఈ నెల 27న గురువారం నిర్వహించనున్న ఎంఎల్‌సి పట్టభద్రుల పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో పరిశీలించారు. బ్యాలెట్ సీరియల్ నెంబర్లు పరిశీలించాలని, ప్రింటింగ్ తప్పులు, పేపరు బాగుందీ, నలిగిపోయినదీ పరిశీ లించి బ్యాలెట్ పేపర్ తొలగింపు వంటి అంశాలపై సిబ్బందితో జాయింట్ కలెక్టర్ చర్చించారు. డిఆర్‌ఒ బిఎల్ఎన్.రాజకుమారి సెక్షన్ సూపరిం టెండెంట్ మురళీకృష్ణ, పరిపాలనాదికారి కె.కాశీ విశ్వేశ్వర రావు, తహశీల్దార్లు అశోక్ కుమార్, ఐపి.శెట్టి, ప్రసాద్, సుబ్రహ్మణ్యాచారి, డిటిలు వంశీ, శివరాజ్ చినబాబు, రెవెన్యూ సిబ్బంది భరత్ తదితరులు పాల్గొన్నారు

శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుండి మార్చి 2 వతేది వరకు మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఆలయ ఇఒ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ ఆవరణ వెలుపల చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగసుదరంగా తీర్చిదిద్దుతున్నామని, వృద్ధులు, వికలాంగులఉ సునాయాసంగా స్వామి వారి దర్శనం జరిగేలా ప్రత్యేక క్యూలైన్లు, ప్రత్యేక దర్శనం లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు సిద్ధం చేస్తున్నామని, మెడికల్ క్యాప్ అందుబాటులో ఉంచుతు న్నామని, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కార్టూ'నిజం'



ప్రజా సమస్యలపై పోరాడేది పిడిఎఫ్ మాత్రమే..

ప్రజాశక్తితో ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారు. 9 నెలలు గడుస్తున్నప్పటికీ వారికిచ్చిన హామీలను ఏమాత్రం అమలు చేయలేకపోతున్నారు. ముఖ్యంగా నిరుద్యోగుల సమస్యలను కనీసంగానైనా పట్టించుకోవడం లేదు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఈ ప్రభుత్వంపై కనిపిస్తుంది. విజ్ఞులయిన పట్టభద్రులు కూటమి అభ్యర్థిని తప్పకుండా ఓడిస్తారు. సొంత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిత్యం ప్రజా పోరాటాలు సాగిస్తున్నారు. ఆ ప్రజలే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను మరోసారి గెలిపిస్తారని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల సిట్టింగ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను ఆయన పంచుకున్నారు.

కూటమి ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుంది...

ప్రస్తుతం ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు చోట్ల కూటమి పక్షన అభ్యర్థులు పోటీలో నిలిచారు. అధికారంలోకి వచ్చి 9 నెలల గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జాప్యం జరుగుతుంది. అది వ్యతిరేక ఓటుగా మారే అవకాశం ఉంది. కూటమిని ఎవరూ కూల్చనక్కరలేదు. దానికి అదే కూల్చేసుకుంటుంది. ప్రజా వ్యతిరేకతే ఆ రకంగా పనిచేస్తుంది. గతంలో కూడా ఇంత చేశాం. అంత చేశామని గొప్పలు చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డికి కూడా ఇదే అనుభవం ఎదురైంది. ఆ రకంగా గ్రాడ్యుయేట్స్ స్థానాలు అన్నింటా పాలకపక్షం ఓటమి చవిచూసింది. అధికారంలో ఉన్న వాళ్లు ఎన్ని హామీలిచ్చినా వాటిని అమలు చేయడంలో జాప్యం చేయడం వంటి ఇతర అనేక కారణాలు అధికార పక్షానికి వ్యతిరేక గాలివీచే అవకాశం ఉంది. ఇటువంటి కారణాలతో అధికార పార్టీ అభ్యర్థిని పోటీలో పెట్టిస్తే గెలుపు నల్లేరు మీద నడక అనుకుంటే సాధ్యం కాదు. పిడిఎఫ్ బలమైన పునాది కలిగి, వ్యవస్థీకతమైన ఓటింగ్ కలిగినటువంటి ఒక వ్యవస్థగా నేడు అభివద్ధి చెందింది. అదే పిడిఎఫ్ గెలుపునకు ఒక శుభ పరిణామం.

ప్రజాసమస్యలపై పోరాడే, మాట్లాడే వేదికగా పిడిఎఫ్...

పిడిఎఫ్‌కు వర్గ, ప్రజా సంఘాల మద్దతు పూర్తిగా ఉంది. అదే గెలుపులో కీలక భూమిక పోషిస్తుంది. 2007 నుంచి సుమారు 18 ఏళ్ల పాటు పిడిఎఫ్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు గెలిచి ప్రజా సమస్యలపై పోరాడారు. శాసనమండలి బయట, లోపల కూడా ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా పనిచేశారు. ప్రజల సమస్యలు విని, వినతలు తీసుకొని శాసనమండలిలో గళం వినిపించడం తోబాటు అవసరమైతే దాని మీద ప్రభుత్వానికి లేఖలు కూడా రాశాం. ప్రజా సంఘాలు చేస్తున్న అనేక పోరాట, ఉద్యమాలకు మద్దతుగా నిలిచాం. ప్రత్యక్షంగా పాల్గొంటున్నాం. ఇటువంటి పని ఏ అధికార ప్రతిపక్షమూ కూడా చేయలేదు. అడపాదడపా చేసినా అవి వాళ్ల రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే. లేదా ప్రతిపక్షాలుగా తమ ఉనికి చాటుకునేందుకు బాధితుల తరపున మాట వినిపించి వచ్చారే తప్ప సమస్య పరిష్కారం కోసం నిజాయితీగా కృషి చేసిన దాఖలాలు లేవు.

అందుకే పాలక, ప్రతిపక్షాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. అదే పిడిఎఫ్‌కు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ఎన్నికల రాజకీయాల కోసమో, పదవుల కోసమో, సొంత ప్రయోజనాల కోసమో పిడిఎఫ్ అభ్యర్థులు పోటీ చేయరు. ప్రజా సమస్యలు వినిపించేందుకు, బాధితులకు బాసటగా ఉండేందుకే పిడిఎఫ్ పోటీలో నిలుస్తుందని ప్రజల్లో బలంగా ఉంది. నిజాయితీగా పిడిఎఫ్ పనితీరును గమనించిన ఎవరైనా సరే పాలక, ప్రతిపక్షల వైపు మొగ్గు చూపరు. అటువంటి ఒక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది పిడిఎఫ్. ప్రజా సమస్యలపై పోరాడే, మాట్లాడే వేదికగా పిడిఎఫ్‌ను ప్రజలు చూస్తున్నారు.

ప్రజలు చేసిన ప్రతి పోరాటాన్ని బలపరిచాం.

పిడిఎఫ్‌గా అంగనవాడీ, ఆశ, మిడ్ డే మిల్స్, వాలంటీర్లు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు మహిళలు, అవుట్సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగులు, మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్‌లలో పనిచేస్తున్న వారు విద్యార్థులుతోపాటు ఏవైతే వర్గ, ప్రజాసంఘాలు ఉన్నాయో వారు చేసే పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాం. పిలిస్తే పలికేది పిడిఎఫ్. రమ్మంటే వచ్చేది పిడిఎఫ్. ఆ రకమైన పద్ధతుల్లో మేధో శ్రమజీవులు,శ్రామిక జీవుల పక్షాన పిడిఎఫ్ ఉంటుంది. పిడిఎఫ్ రాజకీయ పక్షము కాదు. రాజకీయ రహితము కాదు. కానీ పిడిఎఫ్ కచ్చితంగా ప్రజా రాజకీయాలు చేస్తుంది. పిడిఎఫ్ ది వ్యక్తిగత విమర్శ కాదు. విధానపరమైన విమర్శ.

పునాది అభ్యసనాన్ని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -మామిడికుదురు, ముమ్మిడివరం

శిక్షణ పొందిన అంగనవాడీలు చిన్నారులకు పునాది అభ్యసనాన్ని బలోపేతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. మామిడికుదురు హైస్కూల్లో జ్ఞాన జ్యోతి శిక్షణ ముగింపు సందర్భంగా సోమవారం అంగన్‌వాడీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు ఎంఇఒ-2 ఎం.వెంకన్నబాబు మాట్లాడుతూ చిన్నారులకు ఆటలతో పాటు గుణాత్మక విద్యను అందించాలన్నారు. అభ్యసనను బలోపేతం చేయడం, తల్లిదండ్రులకు సమాజం భాగస్వామ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వెన్యూ ఇన్‌ఛార్జిగా సిహెచ్.నిరంజని వ్యవహరించగా డిఆర్‌పిలుగా టి.వెంకటేశ్వరరావు, వై.పళ్లంరాజు, ఎంఎన్.మునేశ్వరరావు, పి.విజయలలిత, బి.అన్నపూర్ణ, ఎన్.సుబ్బలక్ష్మి శిక్షణ తరగతులు నిర్వహించారు.

ముమ్మిడిరం విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందనిఎంఇఒ రాంబాబు పేర్కొన్నారు. జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా బాల్యారంభ సంరక్షణ, విద్య (ఇసిసిఇ), భాష, సంఖ్యల పునాదిగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. అనంతరం పాఠశాల సంసిద్ధత మేళా ద్వారా పేరు నమోదు కార్యక్రమం, శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధో అభివృద్ధి, గణిత నైపుణ్యాలు, సామాజిక భావోద్వేగాల అభివృద్ధిలో కృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఉదయ్ భాస్కర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మామిడికుదురులో శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీలు

అనిల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన పర్రపేటకు చెందిన కుంచే అనిల్ కుమార్ కుటుంబాన్ని సోమవారం వైసిపి సీనియర్ నాయకుడు గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. అనిల్ తల్లిదండ్రులు అన్నవరం, పల్లంరాజును రమణారావు ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. వారికి రూ.25 వేల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబానికి సాయం చేసిన రమణారావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుంచే సత్యనారాయణ, అర్జునరావు, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, నాయకులు నేలపూడి సుగంధ కుమార్, పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

వెంకన్న హుండీల ఆదాయం రూ.1.34 కోట్లు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి వారి హుండీ ఆదాయాన్ని ఆలయ ముఖ మండపంలో సోమవారం రాజమహేంద్రవరం దేవాదాయ శాఖ తనిఖీ అధికారి టివిఎస్ఆర్ ప్రసాద్ పర్యవేక్షణలో 31 రోజులకు లెక్కించారు. ఈ లెక్కింపులో హుండీల ఆదాయం రూ.కోటీ 34 లక్షలతోపాటు 30 గ్రాముల బంగారం, కేజీ వెండి, పలు విదేశీ నోట్లు, ఆలయ ప్రాంగణంలోని శ్రీవిశ్వేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2 లక్షల 82 వేలు సమకురాయని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ముదునూరి వెంకటరాజు, ఉప సర్పంచ్ పి.బాబూరావు పాల్గొన్నారు.

షష్టి పూర్తి అరుదైన వరం

ప్రజాశక్తి-కొత్తపేట

60 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత పిల్లలు ప్రయోజకులై వారి సమక్షంలో చేసుకునే షష్టిపూర్తి అరుదైన వరమని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అన్నారు. తమ్మన సాయి ప్రసాద్, నాగమణి దంపతులు షష్టిపూర్తి కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. అందరినీ ఆప్యాయంగా పలకరించే తమ్మన సాయిప్రసాద్ దంపతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శిల్పి రాజ్‌కుమార్ వడయార్, విళ్ల మారుతి, గుబ్బల మూర్తి, జగతా రాంబాబు, బూసి విష్ణు, శ్రీకాకుళపు బంగారం పాల్గొన్నారు.

డైరెక్టర్ రామంకు సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన భీమనపల్లికి చెందిన కంకటాల రామంను సోమవారం అమలాపురం రీ డిస్ట్రిబ్యూటర్స్ స్టాకిస్ట్స్ అసోసియేషన్ సత్కరించింది. రామంకు రాష్ట్ర స్థాయి పదవి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఆకి సూరిబాబు, కార్యదర్శి యెండూరి చంటి, కోశాధికారి మద్దింశెట్టి దొరబాబు, నల్లా చిన్న, పచ్చిగోళ్ల రాజు తదితరులు ఉన్నారు.

ఈశ్వరీబాయి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రిపబ్లికన్ పార్టీ నాయకురాలిగా, అంబేద్కరైట్‌గా, మహిళల హక్కుల కోసం పోరాడిన యోధురాలు ఈశ్వరీబాయి జీవితం ఆదర్శనీయమని రిపబ్లికన్ పార్టీ నాయకులు కొనియాడారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధపార్కు ఆవరణలో సోమవారం ఈశ్వరీబాయి 34వ వర్ధంతి శరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికకార్యకర్త మాకా రాజేంద్రన్ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్, ఈశ్వరీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో తొలి మహిళా కార్పొరేటర్‌గా, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పని చేయడమే కాక రెండుసార్లు ఆర్‌పిఐ ఎంఎల్‌ఎగా పని చేసి బడుగు బలహీన వర్గాల సమస్యలపై శాసన సభలో గళమెత్తిన యోధురాలని, కంచికచర్ల కోటేశ సజీవదహనంపై సభలో చర్చకు పట్టు బడితే దీనికి అడ్డుపడిన మంత్రిపై చెప్పు విసిరిన ధీశాలి ఈశ్వరీబాయి అని కొనియాడారు. మహిళా హక్కుల కోసం గళమెత్తిన పోరాట యోధురాలు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సఖిలే పథ్వీరాజ్, కవి, బొక్క శ్రీను, పొద్దువాక భీమారావు పాల్గొన్నారు.

ఒత్తిడిని వదలండి.. చక్కగా చదవండి..

ప్రజాశక్తి-కొత్తపేట

పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు ఏమాత్రం ఒత్తిడికి లోను కాకుండా చక్కగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కొత్తపేట సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కట్టా నాగమోహన్ విద్యార్థులకు సూచించారు. కళాశాలలో సోమవారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల పరిపాలనాధికారి రెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు. తల్లితండ్రులను గౌరవించిన వారే గురువును కూడా గౌరవిస్తారని, ఈ ముగ్గురిని గౌరవించిన వారే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థికి తల్లి తొలిగురువని తండ్రి మలి గురువు అని చదువు నేర్పే గురువులు తర్వాత గురువులని అన్నారు. విజ్ఞానపు గురిని నేర్పే ఈ గురువులను గుర్తించి గౌరవించిన వారే చరిత్రలో ఉన్నత శిఖరాలు అధిరోహించారని అన్నారు. ఉన్నత లక్ష్యం సాధించడానికి పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు. గురువుల శిక్షణను విద్యార్థులు మరిచిపోరాదని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల ప్రతిభా విశేషాలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు జి.శ్రీను, ఎన్.జైరాజ్, ఎస్.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, ఎన్.దొరబాబు, ఎం.సుధ, డాక్టర్ వివివిఎస్ సుబ్బారావు, ఆఫీస్ ఇన్‌ఛార్జిలు ఎస్.ప్రశాంత్, ఎఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ

పలు కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల మండలంలో జరిగిన రెండు చోరీల కేసుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కోరంగి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ పి.సత్యనారాయణ వివరాలను వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ రాత్రి 1 గంట సమయంలో తాళ్లరేవుకు చెందిన నూలు రాజేశ్వరి ఇంటి ఆవరణలోకి ప్రవేశించి ఆమె మెడలో గొలుసు, నల్లపూసల తాడును దొంగిలించుపోయిన కేసులో తాళ్ళరేవు నందిరేవు పేటకు చెందిన పోతాబత్తుల యేసురాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని నుంచి రెండున్నర కాసుల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈనెల 22వ తేదీన కోరంగి ఎల్లమ్మ తల్లి ఆలయంలో హుండీ దొంగిలించిన కేసులో కాకినాడ రూరల్ మండలం తూరంగి శివారు పగడాల పేటకు చెందిన బొడ్డు అంజిబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని నుంచి రూ.160 నగదు, సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంజిబాబుపై కాకినాడ క్రైమ్, ఇంద్రపాలెం స్టేషన్లలో పలు నేరాలపై ఆరు కేసులు ఉన్నట్లు వెల్లడించారు. ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా జ్యూడిషియల్ రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామ శివారు పోలవరం గట్టున ఒక గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. గ్రామ విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదుతో సంఘటనా ప్రాంతాన్ని ఎస్ఐ శివనాగు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరి వేసుకుని మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. నీలం, పసుపు, నలుపు రంగులతో పొడుగు చేతులు షర్ట్, బిస్కెట్ రంగులో ప్యాంట్ వేసుకున్నట్లు తెలిపారు. మృతదేహం పక్కనే ఒక సైకిల్ పడిపోయి ఉందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతిని యొక్క సమాచారం తెలిసిన వారు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ నెంబర్ 9440796529 కానీ, తన నెంబర్ 9440904841ని సంప్రదించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కూటీ ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు దాటుతున్న మహిళను స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువతులు ఢీ కొట్టడంతో ఆ మహిళ తీవ్రంగా గాయపడింది. ముమ్మిడివరం మండలం అనాతవరం కైరం వారి వీధికి చెందిన పేరూరి శ్రీమహాలక్ష్మి తన తోటి కోడలు లక్ష్మితో కలిసి కొమరగిరి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తోంది. అనాతవరంలో రోడ్డు దాటుతుండగా స్కూటీపై వెళుతున్న మెడికల్ విద్యార్థినిలు ఢీకొట్టడంతో శ్రీమహాలక్ష్మి తీవ్రంగా గాయపడింది. ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురుని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రఘుదేవపురం లంక పొలాలకు వెళ్లే మార్గంలో పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు.వారి నుంచి పేక ముక్కలతో పాటూ రూ.9,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు, జరిమానా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అత్యాచారం కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరంలోని పిఅండ్‌టి కాలనీకి చెందిన వాసంశెట్టి దేవికుమార్ లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బాధితురాలుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. ఈ మేరకు బాధితురాలు ప్రకాష్ నగర్ పోలీస్‌కు 2023 మే 20న ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ. పి.ప్రేమరాజు ఈ మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి సిఐ ఎస్.లక్ష్మణరావు కేసుపై దర్యాప్తు చేశారు. నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం వచ్చిన సిఐ పిఇ.పవన్‌కుమార్‌రెడ్డి ఛార్జిషీటు దాఖలు చేసినారు. ప్రస్తుత సిఐ ఆర్ఎస్‌కె.బాజీలాల్ సాక్ష్యాదారాలు సేకరించి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితునిపై నేరం రుజువు కావడంతో 8వ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స కోర్టు న్యాయమూర్తి వై.బెన్నయ్య వాసంశెట్టి దేవికుమార్‌కు జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్షణ పడేలా చర్యలు తీసుకున్న సెంట్రల్ జోన్ డిఎస్‌పి కె.రమేష్‌బాబు, ప్రస్తుత ప్రకాష్ నగర్ సిఐ బాజీలాల్, అప్పటి సిఐ పిఇ.పవన్‌కుమార్‌రెడ్డి, కానిస్టేబుల్ రమేష్‌ను ఎస్‌పి అభినందించారు.

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - తొండంగి

తొండంగి మండలంలోని పలు గ్రామాల్లో పిడిఎఫ్ అభ్యర్థి గిడ్ల వీరరాఘవులును గెలిపించాలని ప్రజాసంఘాలు ప్రచారం నిర్వహించాయి. ఈ సందర్భంగా మండంలో ఉన్న పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను ఓటర్లకు వివరించారు. ప్రజల పక్షాన పోరాడేది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనని గుర్తు చేశారు. మండలంలో ఆటో ప్రచారం చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులుకు బ్యాలెట్ పేపర్లో 14 నెంబర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారం కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సింహాచలం, మచ్చ కామేశ్వరి, సుబ్రహ్మణ్యం, ఎం.యోగి తదితరులు పాల్గొన్నారు

ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు

28 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో నిర్వహించిన సాఫ్ట్‌వేర్ జాబ్‌మేళాలో 28 మంది ఎంపికయ్యారని సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. సోమవారం జైష్ణ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధుల సమక్షంలో నియామక పత్రాలు అందించారు. స్థానిక విఎస్ఎం కళాశాలలో ప్రముఖ ఐటీ కంపెనీలో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా మెగా సాఫ్ట్‌వేర్ జాబ్ మేళా నిర్వహించి ఐటి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలో ఎంపికైన 28 మందిని తొలి ప్రాధాన్యతలో ఎంపిక చేసినట్టు జైష్ణ మేనేజింగ్ డైరెక్టర్ సుంకర ఉషారాణి, సిఇఒ పుప్పల రామకృష్ణ తెలిపారు. అనంతరం ఎంపికైన వారికి నియామకపత్రాలు అందించారు. త్వరలో మరిన్ని కంపెనీల్లో నియామక పత్రాలు అందించనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ సత్యం తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని ఉద్యోగావకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులకు ప్రముఖ ఐటి కంపెనీల్లో ఉద్యోగావకాశాలకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా క్రమాలు మరింత విస్తృతం చేస్తామని వారు వెల్లడించారు.

బాలాజీ అన్నదాన ట్రస్ట్‌కు రూ.11,116 విరాళం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు మానేపల్లి వాసులు ఉండవల్లి రాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు రూ.11,116 విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు సోమవారం తెలిపారు. ఆలయ అర్చకులు దాత కుటుంబ సభ్యులకు వేదాశీర్వాదం అందజేసి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారన్నారు.

సామాజికవేత్త బాబ్జికి ఘన నివాళి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వన్నెచింతలపూడికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, ఉద్యమకారుడు అంబేద్కర్ వాది పచ్చిమాల బాబ్జి మృతి తీరని లోటని సమనస గ్రామ సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్ అన్నారు. సోమవారం వన్నెచింతలపూడిలోని బాబ్జి కుటుంబాన్ని శ్యామ్ కుమార్ పరామర్శించారు. బాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. బాబ్జి కుటుంబ సభ్యులకు శ్యామ్ కుమార్ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. సర్పంచ్ వెంట పరమట భీమమహేష్, పరమట మురళీకృష్ణ, జాన్, నాగరాజు, శివకుమార్, వెంకటేష్, బళ్ల రాజకుమార్ ఉన్నారు.

సచివాలయంలో నిర్వహించిన ఆధార్ క్యాంపు

స్పెషల్ ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అంబాజీపేట

గంగలకుర్రు, మాచవరం-3, పుల్లేటికుర్రు-1, సచివాలయాల వద్ద సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, నాగాబత్తుల శాంతాకుమారి, జల్లి బాలరాజు ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఆధార్ లేని ఐదేళ్ల వయస్సు పిల్లలకు ఆధార్ నమోదు చేశారు. ఆధార్ నమోదుతో భవిష్యత్తులో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆయా సర్పంచులు పేర్కొన్నారు.

కరాటేలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలోని శ్రీసిద్ధార్థ పాఠశాల విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఆలిండియా కరాటే ఛాంపియన్‌షిప్-2005 ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ కేటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారని స్కూల్ అధినేత కె.ముల్లారావు సోమవారం తెలిపారు. స్థానిక పాఠశాల విద్యార్థులైన జి.జాయ్ కిరణ్ ప్లేస్ ఇన్కాట విభాగంలో ప్రథమ బహుమతిని, బి.ద్రైవిక్ ఆశిష్ వెపన్ విభాగంలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో అధినేత ముల్లారావు విద్యార్థులను అభినందించారు. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో కూడా బహుమతులు సాధించాలని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రిన్సిపల్స్ ఎ.ఇందిరా నిర్మల, ఆర్.గుణశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోహిణి, శశివదనలకు ఘన సన్మానం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం వన్నెచింతలపూడి (సమనస) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.రోహిణి, ఎస్.శశివదనలను వైసిపి సీనియర్ నాయకులు పచ్చిమాల శ్రీనివాసరావు, ఎన్ఎస్ టీచర్ విజయలక్ష్మి దంపతులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల వారు తయారు చేసిన మల్టీపర్పస్ సైక్లింగ్ మిల్లర్ ప్రాజెక్టు జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. గతంలో శ్రీనివాసరావు భార్య విజయలక్ష్మి ఎన్ఎస్ టీచర్‌గా అదే పాఠశాలలో పని చేశారు. ఈ సందర్భంగా ఈ దంపతులు విద్యార్థుల నైపుణ్యాన్ని కొనియాడారు. భవిష్యత్తులో ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సాంకేతిక విద్యను పెంపొందించుకుంటూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని, ఇటువంటి ప్రాజెక్టులు ఎన్నో తయారు చేసి ఉన్నత స్థాయికి వెళ్లాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గైడ్ చేసిన హెచ్ఎం నాగ సత్యనారాయణ, ప్రాజెక్ట్ టీచర్ ప్రకాష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు పి.రోహిణి, ఎస్.శశివదన, గైడ్ ఉపాధ్యాయులను సన్మానించి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లాలో ఎస్ఇబి స్టేషన్ పరిధిలో సారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇతర నేరాల్లో పట్టుబడిన వివిధ రకాల 6 బైకులకు సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరిండెండెంట్ ఎస్‌కెడివి.ప్రసాద్ సమక్షంలో ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద వేలం నిర్వహించారు. ఇందులో 6 వాహనాలకు రూ.85 వేలు వేలం ద్వారా రాగా జిఎస్‌టి ద్వారా రూ.12 వేలతో కలిపి మొత్తం రూ.97 వేలు ఆదాయం సమకూరిందని ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు, ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

ఆదర్శ యోజన నిధులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ పి ప్రశాంతి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఆదర్శ యోజన నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ నుంచి ఏలూరు , కాకినాడ జడ్‌పి సిఇఒలతో పిఎం ఆదర్శ యోజన పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం ఆదర్శ యోజన కింద షెడ్యూల్ కులాల నివాసిత గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రాజ్, రూరల్ వాటర్ సప్లయ్ ఆధ్వర్యంలో ప్రతిపాదిత పనులు మార్చి 31 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన నిధులను విడుదల చేసిందన్నారు. సుమారు రూ.5కోట్ల నిధులతో 100 పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. సిసి రోడ్లు, డ్రెయిన్లు, ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్లు, పైపు లైన్లు, సాలిడ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. వాటికి సంబంధించిన డ్రెయిన్స్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. మార్చి 31 లోగా నిధులను ఖర్చు చేయాలని, వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం డివిజన్ రాజానగరం, సీతానగరం, కోరుకొండ, కొవ్వూరు డివిజన్‌లో దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో పలు అభివృద్ధి పనులకు సంబంధించి మండలాల వారీగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఏలూరు జడ్‌పి సిఇఒ సుబ్బారావు, కాకినాడ జడ్‌పి సిఇఒ లక్ష్మణకుమార్, సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్.శోభారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బివి.గిరి తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా ఓపెన్ ల్యాబ్ డే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల సైన్స్ విభాగం వారు 'ఓపెన్ ల్యాబ్ డే'ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు సైన్స్ పట్ల అవగాహన, సైన్స్ పరిశోధనల పట్ల ఉత్సుకత, ప్రేరణను కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలు చున్నీలాల్ జాజు మున్సిపల్ హై స్కూల్, కంటిపూడి రామారావు మున్సిపల్ హై స్కూల్, నన్నయ్య మున్సిపల్ హై స్కూల్, టౌన్ హై స్కూల్ సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు 600కు పైగా పాల్గొన్నారు. 11 సైన్స్ విభాగాలు ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను, అరుదైన సైన్స్ పరికరాలను, ల్యాబులను వీక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

వైసిపి గోకవరం టౌన్ అధ్యక్షునిగా చిన్న

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి గోకవరం టౌన్ అధ్యక్షునిగా వైసిపి సీనియర్ నాయకులు బాడితబోయిన చిన్నాను నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోట నరసింహం ఆయన్ని శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గోకవరం టౌన్ అధ్యక్షులుగా నియమించిన మాజీ మంత్రి తోట నరసింహం, యువ నాయకులు తోట రాంజీలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పాటి రాంబాబు, ఎంపిపి సుంకర శ్రీవల్లి, సొసైటీ మాజీ అధ్యక్షులు దాసరి చిన్నబాబు, వైసిపి లీగల్ అడ్వయిజర్ గుల్లా ఏడుకొండలు, వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, నాయకులు సుంకర వీరబాబు, గోకాడ చిట్టిబాబు, గుబ్బలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నరాల శెట్టి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నాను సత్కరిస్తున్న తోట నరసింహం తదితరులు

శివరాత్రికి పాలంగి ముస్తాబు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పాలంగి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. బుధవారం నిర్వహించే శివరాత్రికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని ఆలయ ఇఒ ఎంవి.రామయ్య సోమవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయని, బుధవారం తెల్లవారు జాము మూడు గంటల నుంచి భక్తులు దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. సుమారు 50 వేల మంది హాజరవుతారని అంచానా వేస్తున్నామన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఆలయంలో ఏర్పాట్లను ఎస్ఐ జి.శ్రీనివాసరావు పరిశీలించి మాట్లాడారు. బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలిపాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఆలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తారన్నారు. నిర్వాహకులకు సహకరించి శివరాత్రిని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు విఎస్.రఘుశర్మ తదితరులు పాల్గొన్నారు.

పశువుల కంటైనర్ సీజ్

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని కృష్ణవరం టోల్‌గేట్ వద్ద పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీని పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ జి.సతీష్ మీడియాకు వివరించారు. ముందస్తు సమాచారంతో టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఒక కంటైనర్ లారీలో పశువులను తరలిస్తున్నట్లు గుర్తించి ఆ లారీని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ వాహనంలో విజయనగరం నుంచి కేరళ రాష్ట్రానికి 72 పశువులను తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కంటైనర్‌లో ఉన్న పశువులను గోసాల సంరక్షణకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు

పలు సమస్యలపై ఎంఎల్‌ఎ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్ఐఒ మునిస్వామితో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ ప్రజలు, భక్తుల కోరిక మేరకు వెంకటేశ్వర స్వామి వారి ఆభరణాలు పాత కమిటీ నుంచి సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజలకు ఆ నగలు చూపించాలన్నారు. కళ్యాణోత్సవంలో ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో స్వామివారికి ఆభరణాలను ధరింపచేయాలన్నారు. వీటిపై అధికారులు నిర్లక్ష్యం తగదన్నారు. కనకాలపేట డంపింగ్ యార్డ్‌ను ప్రజలకు ఇబ్బంది లేని చోట ప్రభుత్వం స్థలం కేటాయించి అక్కడికి తరలించాలన్నారు. మెట్టకూరు గణపతి నగర్‌లో నిర్మిస్తున్న రోడ్డుకు సంబంధించి ఇరువర్గాలకు ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సుబ్బారావుకు ఎంఎల్‌ఎ బండారు అభినందన

ప్రజాశక్తి-కొత్తపేట

కవి, నటుడు, అధ్యాపకుడు పాత్రికేయుడు డాక్టర్ వివివిఎస్.సుబ్బారావు మరిన్ని అవార్డులు పురస్కారాలు సాధించాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఇటీవల రాజోలు నియోజకవర్గం మలికిపురంలో ఎపి ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కళా సంబరాల్లో సుబ్బారావు ప్రదర్శించిన రైతే రాజు ఏకపాత్రాభినయానికి కళాకిరీటి పురస్కారం లభించింది. ప్రముఖ దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్ పేరిట రాజమహేంద్రవరానికి చెందిన మచ్చ కుమార్ రాజా ఆధ్వర్యంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ అధినేత ప్రముఖ ఇంద్రజాలికులు చింత శ్యామ్ నేతత్వంలో పురస్కారాన్ని అందుకున్నారు. ఆ మేరకు సుబ్బారావును ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అభినందించారు. ఆయనతో పాటు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జి, విళ్ల మారుతీ ప్రసాద్, బండారు బుల్లితాత, పప్పుల కొత్తయ్య, వాసంశెట్టి సత్యానారాయణ అభినందించారు.

కాంట్రాక్టు ఉద్యోగికి విద్యుత్ షాక్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీలో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న కాండ్రేగుల మణి సోమవారం విద్యుత్ షాకుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సాయిబాబా టెంపుల్ సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి రిపేర్ చేస్తుండగా విద్యుత్ షాక్ గురై స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. ఆయన తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కె.గంగవరం

ఈ నెల 26 నుండి జరగనున్న కోటిపల్లి మహాశివరాత్రి ఏర్పాట్లను అధికారులు సోమవారం పరిశీలించారు. ఆలయం వద్ద క్యూలైన్లను గోదావరి వద్ద స్నాన ఘట్టాలను రామచంద్రపురం డిఎస్‌పి రఘువీర్, సిఐ వెంకటనారాయణ, కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తదితరులు పర్యవేక్షించారు. యాత్రికులు స్నానాలు ఆచరించే ప్రదేశంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, బారికేడ్లు నిర్మించాలని, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చూడాలని, లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్రమబద్ధకరించాలని సూచించారు.

యాదవులలో సిసి రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం యాదవుల గ్రామంలో సోమవారం పంచాయతీరాజ్ డిఇ ఎం.వెంకటలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. డిఇ వెంట సర్పంచ్ సున్నం వరప్రసాద్ ఉన్నారు

వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా అబ్బులు

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి ఎస్‌సి సెల్ జగ్గంపేట నియోజకవర్గ అధ్యక్షునిగా గోకవరం మండలానికి చెందిన బూలా అబ్బులు నియమితులయ్యారని మాజీ మంత్రి తోట నరసింహం వెల్లడించారు. ఈ సందర్భంగా అబ్బులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని దళితులందరూ వైఎస్ఆర్ ఆశయ సాధనలో పయనించే విధంగా చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి, సుంకర వీరబాబు, పాటి రాంబాబు, దాసరి చిన్నబాబు, సమ్మెట మోహన్, గుల్లా ఏడుకొండలు, మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు, నరాలశెట్టి నరసయ్య, ఆలీషా, సత్యవతి, బాడితబోయిన చిన్న, దంగేటి వెంకటరత్నం, శరకణం మురళీకృష్ణ, అబ్బిరెడ్డి చిన్ని, వై.పవన్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కడియం శివాలయంలో ఎంపీ పూజలు

ప్రజాశక్తి- కడియం

కడియం శ్రీ భ్రమరాంభామల్లేశ్వర స్వామి ఆలయాన్ని ఎంపీ పురంధేశ్వరి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ఆది దంపతుల కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీ మార్తి బాలకష్ణ శర్మ నిర్వహించారు. తోరాటి శ్రీనివాసరావు దంపతులు, మల్యాల రాజేష్ దంపతులు, చిక్కాల నాగేశ్వరరావు దంపతులు, కోన శ్రీనివాసరావు దంపతులు పీటల మీద కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఆకుల శ్రీధర్, చిక్కాల ఈశ్వరరావు, బొరుసు సుబ్రహ్మణ్యం, వెలుగుబంటి నాని, గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి (మోటార్ వెహికల్స్ ట్రిబ్యునల్) వారి కోర్టు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా

M.V.O.P. No. 693/2023

బిట్వీన్:
పిల్లా దుర్గ సురేంద్ర **-పిటీషనర్**
మరియు
శ్రీ సేవా భూలోకం అండ్ అదర్స్
టు: ఏలూరి పద్మావతి, W/o. వెంకటేశ్వరరావు, 38 సం॥రాలు, ఓనర్ ఆఫ్ లారీ బేరింగ్ నెం. ఎపి 05 టిడి-7988, డోర్ నెం. 5-19/1, నడవీధి, వడిశలేరు గ్రామం, రంగంపేట మండలం. **-2వ రెస్పాండెంట్**

పై నెంబరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున **ది. 03-03-2025వ సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా లేక ప్లీడరు ద్వారా గాని పై పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను పరిహారములను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.మహాలక్ష్మి
పి.శ్రీనివాస్, అడ్వకేట్స్
రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం
24-2-2025 సెల్: 9440223711

In the Court of the VIth Additional District Judge at Kakinada

A.S. No. 138/2019

Between:
Machavarapu Naresh Kumar ***...Appellant***
AND
Tavitiki Suguna Kumar ***...Respondent***
To:
Family members of (late) Tavitiki Suguna Kumar, S/o. Prabhudas, Christian, Education and Business, R/o. D.No. 70-3-48/4, Vidyuth Nagar, Road No.1, Kakinada.

పై నెంబరు అప్పీలు దావాలో రెస్పాండెంటు కుటుంబ సభ్యుల చిరునామాకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు రెస్పాండెంట్ కుటుంబ సభ్యులు తీసుకొనకుండగా evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 10-3-2025వ సం॥ తేదీకి వాయిదా వేసినారు.** సదరు రెస్పాండెంట్స్ కుటుంబ సభ్యులు ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై అప్పీలు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
భమిడిపాటి వెంకట రామశర్మ
డి.వి.యస్.యస్.సుజన
న్యాయవాదులు, కాకినాడ
సెల్: 9246589838

IN THE COURT OF THE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KAKINADA

I.A. No. 602/2023 in O.S. No. 805/2023

Between:-
Nellore Sumathi ...Petitioner/Plaintiff
and
Akula Veera Venkata Rama krishna & Others **...Respondants/Defendants**
To.
R-1: Akula Veera Venkata Rama Krishna S/o. Narasimha Rao, hindu, Employee, D.No. 53-1-42, Puramvari Street, Near Satemma Talli Stree, Corner Building, Jagannaikpur, Kakinada.

పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.13-03-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను., లేనియెడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించ బడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
బోయనపల్లి రాధాకృష్ణ
ఎ.అనిల్ కుమార్ రాజా
అడ్వకేట్స్, డోర్‌నెం6-1-9, జవహర్‌వీది, కాకినాడ,కాకినాడజిల్లా,
సెల్.9440323951

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. 574/2024
A.S.S.R. 3046/2024

Between:
వాడ్రేవు శ్రీనివాస ప్రసాదరావు
and Another
-పిటీషనర్లు (అప్పిలెంట్లు)
మరియు
Power Grid Corporation of India, rep. by its Project Manager V.Venkateswara Rao, Rajahmundry and another **-రెస్పాండెంట్స్**
To: ***1st Respondent:***
Power Grid Corporation of India, rep. by its Project Manager, V.Venkateswara Rao, R/o. Flat No. 4, D.No. 82-6-5/3, Tanuja Residency, 3rd Left Street, Vidyut Colony, Rajamahendravaram.

నోటీసు

సదరు పై నెంబరు గల పిటీషనులో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారని మరియు మీ కంపెనీ ఆ అడ్రస్సులో లేదని, ఎక్కడ ఉన్నది తెలియదని నోటీసులపై ఎండార్స్‌మెంటు వచ్చినందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు పత్రికా ముఖంగా జారీ చేయమని ఉత్తర్వులు యిచ్చినందున మీకు నోటీసు "ప్రజాశక్తి" రాజమహేంద్రవరంలో సర్కులేట్ అయ్యే పేపరులో ప్రచురించి పై పిటీషను **ది. 18-3-2025వ సం॥రం తేదీకి వాయిదా అయి ఉన్నదని, వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు** మీరు కోర్టుకి స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియచేసుకొనవలసినదిగా యిందుమూలముగా మీకు తెలియచేయడమైనది.
క్రొవ్విడి వెంకటరావు
పిటీషనరు తరపు న్యాయవాది
రాజమండ్రి రాజమహేంద్రవరం
తేది:24-2-25 సెల్: 9440254625